
# కీలెరిగి వాత

ఓ. కామేశ్వరి



"అలా నవ్వుతావేమిటే.... సిగ్గులేదూ. నవ్వేలా వస్తుందసలు"
"నవ్వక. ఏడ్చి ఏం సాధించమంటావో చెప్పు."
"అయితే అలా చూస్తూ వూరుకుంటావా.... ?"
"వూరుకోక ఏం చెయ్యమంటావో పోనీ నువ్వే చెప్పు."

"నిలేసి అడుగు. చవటదద్దమ్మలా వూరుకుంటున్నావు కాబట్టే అతని ఆటలు సాగుతున్నాయి."

"సరే అడుగుతాననుకో.... మొదట తెల్లబోతారు. భయపడ్తారు. ఏం లేదని బొంకుతారు. చెప్పుడు మాటలు వినవద్దని కేకలేస్తారు. రెండు రోజులు కాస్త జాగ్రత్తగా నా కనుమానం రాకుండా మసలుతారు.

నాల్గురోజులు పోతే మళ్ళీ మామూలు మరోసారి నిలేస్తే కసురుతారు. తిడతారు యింకా సాధిస్తే నాయిష్టం అని మొండి కేస్తారు.... నేను తిట్టి. ఏడ్చి. సాధించి. నెత్తి మొత్తుకుని. నా జుట్టు పీక్కుని. ఆయన జుట్టు పీకుతాను.... చెంప పగలగొడ్తారు.... ఎలాగో తెల్సిందని మరీ బరితెగించి నా యిష్టం అంటే నన్నేంచెయ్యమంటావో చెప్పు అప్పుడు?"

"ఇష్టం వచ్చినట్టు యిష్టంవచ్చినదానితో తిరిగితే చూస్తూ వూరుకోనను"

"వూరుకోకపోతే వురెట్టుకో అంటే?"

"నీలాంటి మొగుడితో కాపురం చెయ్యను యింట్లోంచి పోతానని బెదిరించు."

"సరే పోతే పో అంటే.... పంతానికి పోవల్సివస్తుంది. యింట్లోంచి ఎక్కడికి పోతాను.... పుట్టింటికి పోవాల్సివస్తుంది. యిద్దరు పిల్లలతో పుట్టింట్లో ఎన్నాళ్లుంటాను- వున్న ఎంత తల్లిదండ్రి అయినా భరిస్తారా.... రెండునెలలు గడిచాక మర్యాదగా వెళ్ళమంటారు- వెళ్లకుండా యింకా అక్కడే పడేడిస్తే కన్నతల్లికి కూడాలోకువే ఆ బతుకు- ఒకసారి యిల్లువదిలాక మళ్ళీ తిరిగివస్తే నాబతుకింకా హీనమవుతుంది.

"అన్నీ భయాలే నీకు.... ఏదో

ఉద్యోగంచేసుకు ఆ మాత్రంబతకలేవా?"

"హుం- నా బి. ఎ. చదువుకి ఎవడి స్తాడు ఉద్యోగం. యిచ్చినా మా గుమస్తా ఉద్యోగం.... ఆ ఐదారు వందలతో పిల్లల్ని పెట్టుకుని పెంచి పెద్దచేసి, చదువులు చెప్పించి, వంటరిగా నిలబడే ధైర్యం నాకుందా."

"పోనీ కోర్టు కెక్కుతానని బెదిరించి చూడు."

"కోర్టు కెక్కే స్తోమత నాకులేదని నీకుతెలుసు. అది ఆయనకీ తెలుసు. ఏదో స్నేహితురాలినని అంటున్నావుగాని కోర్టు కెక్కడం తెలివితక్కువ పని అని నీకు తెలియదే.... అలా కోర్టు కెక్కించి నలుగురిలోపడేసిన ఆ మొగుడితో మళ్ళీ కాపురం ఎలా చెయ్యమంటావు. ఆ కోపంతో ఆయన ఇంట్లోంచి తరిమితే ఎక్కడికిపోనే.

"నీ ఖర్మ. అని నీవే అంటావు. కాస్త భయపెట్టడానికి ఏదో అనవే అంటే పురాణం విప్పుతున్నావు-నీవు స్నేహితురాలివని చూస్తూ వూరుకోలేక అన్నానే తల్లీ-నీవింత చాతకాని చవటవనుకోలేదు.

"కోపగించుకకే పద్మా. నీ బాధ నాకర్థం అయింది .... పద్మా గుప్పిట మూసి వుంచినంతసేపేనే గుట్టు.... నా కాపురం నడివీధి కెక్కించుకుంటే పోయేది నా పరువేగా . ఆ మొగుడితోనే బతకాల్సినదాన్ని ఆయన్ని అందరి ముందు ఎగతాలిని చెయ్యను..

"ఆ హా.... హా. లోకానికి తెలియదనుకుంటే అది నీ వెర్రి.. అందరి కంటె ఆఖరున తెల్సింది నీకే.... అతనికెంత ధైర్యంగా లేకపోతే నీ స్నేహితురాలిని ఆ ఆఫీసులోనే వున్నానని కూడాలేకుండా అంతధైర్యంగా దానితో తిరుగుతున్నాడంటే .ఏంచేసినా యింట్లో పెళ్ళాం సహిస్తుందనే గదా.. నీ వలా నోరుమూసుకు కూర్చో.నాల్గురోజులుపోతే యింటికే తీసుకొచ్చి కాపురం పెడ్తాడు.."

"పద్మా నాకు ఈ విషయం తెలీదనుకుంటే అది నీ పిచ్చి.... మంచి వయసులో వున్న ముప్పై ఐదేళ్ళమగాడు ఏణ్ణర్థంనించి పెళ్లాన్ని చేయివేసి కూడా తాకలేదంటే, ఫిజికల్‌గా ఏదన్నావుండాలి.... లేదంటే యింకో ఆడదానితో సంబంధం వుండాలిఅని.. ఆ పరాకులు, చిరాకులు, ఆ పరధ్యానాలు వాట న్నింటికి అర్థం తెలుసుకోలేని చిన్నదాన్నా. వెర్రిదాన్నా కొన్నాళ్లు అర్థంకాకపోవచ్చు.... తరువాత అర్థం అవదా.. ఫలానా అని తెలియకపోయినా ఆయన వ్యవహారం నాకు తెలియదనుకోకు..


"తెలిసి.... నీ విలా వూరుకోగలిగావంటే నీకు చెయ్యెత్తి దణ్ణం పెట్టాలే తల్లీ.. నీవు మనిషివా, దేవతవా, లేక నీకసలు ఓ గుండె. ఓ మనసు అంటూ లేవా.. యింకో ఆడదయితే ఏడ్చిరాగాలెట్టి తిట్టి సాధించి రోడ్డున పడేది."

"చెప్పావుగా ఏడ్చిసాధించగలిగేది ఏమి లేదని . నేను సాధిస్తూ తిడ్తోంటే యింక అతనికి యిల్లు నరకంలా కన్పించి నాకు మరింత దూరమై ఆమెకి మరింత చేరువవుతాడు, అదేనాకేం తెలియనట్టు నటిస్తూంటే ఆయన క్షణ, క్షణం గిల్టీగా ఫీలవుతూ ఆయన సింపతీ నామీదవుంటుంది. కనీసం... ఏ మొగుడైనా ఎన్నితిరుగుళ్ళు తిరిగినా ఆఖరికి కట్టుకున్న పెళ్లాందగ్గరికి చేరతాడు.

ఛా- అమ్మమ్మలా మాట్లాడానికిసిగ్గులేదూ. ఆయనగారు తిరిగి నన్నాళ్లు తిరిగి మోజు చచ్చాక యీవిడ దగ్గిరకివచ్చి కాళ్లమీద పడితే యీవిడగారు మహా పతివ్రతలా తప్పండి అంటూ లేవదీస్తుందిట.నీలాంటి ఆడవాళ్లున్నంతవరకు మనఆడజాతి అధోగతిలోనే వుంటుంది. కాస్తోకూస్తో చదువుకున్న నీవే యిలా మాట్లాడితే చదువు సంధ్యలేని పాతకాలం స్త్రీలని అనుకోడం ఎందుకు- మనవి బానిసబతుకులే. మన జాతికివిముక్తిలేదు.

"ఏమిటే ఆ ఆవేశం. పద్మా యిదివరకటితరం ఆడవాళ్లు అదృష్టవంతులే.... మొగాడు అలాతిరుగుతాడు కాబోలు, తిరగాలికాబోలు. ఆడవాళ్లనోర్మూసుకుసహించాలి అనుకుంటూ అజ్ఞానంతో ఏ బాధ లేకుండా బతికారు- యినాటి చదువుకుని కాస్త విజ్ఞానం సంపాదించుకుని తప్పొప్పులు తెలుసుకునే విచక్షణ అలవడ్డాక చూస్తూ సంహించలేక, సహించక ఏం చెయ్యాలేక నలిగిపోతూంది- ఆ నాడైనా ఈనాడైనా మగవాడి బుద్ధి చంచలం-అచంచలకాని, అమాయకంగా తప్పులేదని నమ్మలేక, మగవాడికి బుద్ధి చెప్పలేక ఈనాటి స్త్రీలు అనుభవించేనరకం ఎవరికి తెలుస్తుంది.... పద్మా నాకు బాధలేదని, సీతమ్మవారిలా ఓర్చుకుంటూ పరోక్షంగా అయన్ని ప్రోత్సహిస్తున్నానని నీవనుకుంటే అది తప్పు- ఏ భార్యా భర్త రాసలీలలు సహించదు- ఎటొచ్చి చదువు నాకిచ్చిన సంస్కారంతో కాపురం రోడ్డున పడేసుకునే ముందు అన్నికోణాలనించి ఆలోచిస్తున్నాను.

"అలా ఏళ్లతరబడి ఆలోచించు.... నీవు నాకింకేం చెప్పద్దు. ముందు నీడిగ్రీ దులిపి బయటికి తియ్యి- ఎంప్లాయమెంటు ఎక్ఛేంజికి రేపు వెడదాం పద.మాట్లాడకు





నీవు.... పేరు నమోదు చేయించుకో ఆ తర్వాత ఏదో ఉద్యోగం దొరక్కపోదు. నేనే అయితే నాలుగిళ్లలో వంటపని చేసుకుంటానుగాని యీజీవితానికిష్టపడను. బతకడానికి అనేక మార్గాలున్నాయి. ఉద్యోగం దొరికాక అతనికి బుద్ధిచెప్పేమార్గం వుంటుంది, తల్లీ నిన్ను ఈ రోజే కాపురం వదిలియింట్లోంచి వెళ్లమనడంలేదు. ఉద్యోగం వచ్చాక చిన్నపాఠం నేర్పాలి. నీవు నన్ను స్నేహితురాలు అనుకుంటే నేచెప్పినట్టుచెయ్యి.... లేకపోతే నీఖర్మ. యింక నీమొహం చూడను.

"పద్మా.... ఆవేశం నాకూవుందే.... దాంతోపాటు ఆలోచనా వుంది అందుకే నీలా తొందరపడ.

ఉద్యోగానికి అప్లయ్ చెయ్యమనడం తొందరపడడమా .... ముందు ఉద్యోగం రానియవే బాబూ, తరువాత ఆలోచిద్దాం ఏం చెయ్యాల్సిందీ.... మా బ్రాంచి ఆఫీసులో ఓ క్లర్క్ పోస్టువుంది. ఆఫీసరుతో చెప్పి ఎలాగైనా నీకు వచ్చేట్టుచేస్తాము. ముందు ఎంప్లామెంట్ ఎక్స్చేంజిలో పేరుందనీ....నీవింకేంమాట్లాడకు. రేపు పొద్దున పది గంటలకి తయారుగా వుండు.

* * *

"ఏమిటిది? ఏమిటీకాయితం?"

"ఉద్యోగం ఆర్డరు!"

"ఉద్యోగం ఎవరికి!"

"చదివి చూడండి మీకే తెలుస్తుంది!"

"ఏమిటీ నీకు ఉద్యోగం వచ్చిందా? ఎప్పుడప్లయ్ చేశావు....ఎందుకు, అదేమిటి? విజయవాడ బ్రాంచికా....నీకు ఉద్యోగం ఎందుకు....నాకెందుకు చెప్పలేదు!"


"ఉద్యోగం వచ్చాక చెప్పొచ్చని...."

"నీకేం మతిపోయిందా, తినికూర్చోక ఉద్యోగం ఎందుకు నీకు అసలు...."

"తిని కూర్చోలేకే ఉద్యోగం. తిండి ఒక్కటే ముఖ్యంకాదని...."

"ఏం మాటలు జోరుగా వస్తున్నాయి నీకే పుట్టిందా యీ బుద్ధి."

"మనుష్యులు ఎప్పుడూ ఒకలాగే వుండిపోరు...."



"ఏమిటిదంతా, తిన్నగా చెప్పి ఏడు"

"విజయవాడ వెళ్ళి ఉద్యోగంలో ఎల్లుండి చేరుతున్నాను. అంతకంటేచెప్పడానికి ఏమీలేదు. అనవసరంగా ఆవేశపడకండి."

"నీవు వెళ్ళడానికి వీలులేదు-యిప్పుడు నీవు వుద్యోగం చెయ్యకపోతే రోజులు గడవనంత దరిద్రం ఏంలేదు"

"దరిద్రంగా వుందనికాదు. నా కాళ్ళమీద నేను నిలబడగలిగితే నాకు ధైర్యంగా వుంటుంది. స్వశక్తి ఆత్మస్థయిర్యాన్నిస్తుంది. ఎందుకలా ఆశ్చర్యపోతారు .... ఆడదానికి ఆత్మస్థయిర్యం ఎందుకనా .... చూడండి వాదన అనవసరం నేను ఉద్యోగం చెయ్యడానికి నిర్ణయించాను"

"నీవక్కడ ఉద్యోగంచేస్తే యిక్కడ యిల్లు . . . నేను యిక్కడ వంటరిగా"

"మీకు పెళ్ళాం అవసరంలేదు. కావల్సింది వంట మనిషి - డబ్బిస్తే దొరుకుతారు"

"అంటే ... ఏమిటసలు నీ ఉద్దేశం"

నా ఉద్దేశం మీకు తెలుసు. ఏణ్ణర్థం నించి మీకు భార్య అవసరం లేదు .... నా అవసరం మీకు లేదు కనక నేను ఎక్కడ వున్నా ఒకటే అంటున్నాను. అలా తెల్లపోయారేం, నేనన్న మాటలో తప్పేంలేదుగా .... మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి."

".... నీకు..నీకు ఎవరు చెప్పారు?."

"అహ. హా.. గుమ్మడికాయ దొంగెవరంటే మీలాగే భుజాలు తడుముకుంటారు.."


" అ.... ఆ పద్మ వాగిందా.. దాని మాటలు నమ్మావా.. దానిపని చెప్తా.."

"అనవసరంగా ఆవేశపడకండి .... నిజానిజాలు గుర్తించకుండా ఎవరిమాటలు వూరికే నమ్మేంత వెర్రిదాన్ని కాదు.."

"అయితే..అందుకే వెడతానంటున్నావు. నీవు వెళ్లడానికి వీలులేదు.. నేను ఒప్పుకోను.. ఎలా వెడతావో చూస్తాను..యిల్లు కదులు చెప్తాను.

"యిల్లు వదలాలని నిర్ణయించిన ఆడదాన్ని ఎవరూ ఆపలేరు.. రేపు కాకపోతే యింకోరోజు వెడ్తాను.. లేదంటే యీ క్షణమే వెడతాను."

"..నిన్ను.. నిన్ను.. వెళ్లు.. వెళ్లు..




నాల్గునెలలు ఆ చాలీచాలని జీతంతో బతికితే అప్పుడు నీకే తెలుస్తుంది.."

"అంతకంటె తక్కువ డబ్బుతో బతుకుతున్నారు లక్షలమంది. కనీసం నా కాళ్లమీద నిలబడగలిగానన్న తృప్తి. రేపు ఏం జరిగినా ఎదురీదే శక్తి వుందన్న నిబ్బరం వుంటుంది..

"పిల్లల్ని తీసికెళ్లడానికి వీలులేదు.. పో నీవు."

"మహారాజులా వుంచుకోండి—తండ్రి బాధ్యత వహిస్తానంటే అంతకంటె యింకేం కావాలి.."

"నీవు..నీవాడదానివేనా.. పిల్లల్నికూడా వదిలి, యిల్లు, కాపురం, మొగుణ్ని ఏం అక్కరలేదని వెళ్లే నీవు....

"అవునండీ ఆడదాన్నే.. యీకాలం ఆడదాన్ని అని మీరు పాపం మర్చిపోయారు భర్త ఏంచేసినా సహించి పడుండాలి అనుకునే ఆడదాన్ని కాదు నేను.... నాకూ ఓ వ్యక్తిత్వం వుందనుకునే యీకాలంస్త్రీని నేను.. అందుకే ఆడదాన్ని యీ పిల్లల్ని కూడా వదులుకుని వెడుతున్నాను. యీనాటి ఆడదాని మనస్తత్వం పాపం మీరు గుర్తించలేదనుకుంటాను..

"జయా....జయా నే చెప్పేది..

"వినదల్చుకోలేదు.. భార్య విలువ మీరు గుర్తించి..భార్యఅవసరం వుందనుకున్న రోజువస్తే మీరే నా దగ్గరకి రండి. ....యింకేం చెప్పకండి. వినేఓపిక నాకు లేదు.... ...."

"తెగేవరకు లాగేనే మోననిపిస్తుందే నాకు పద్మా"

"నోర్మూయ్....మళ్లీ జావకారి పోతున్నావు. నాల్గుఅంటే నాల్గురోజులలో అతను నీదగ్గిరకి పరిగెత్తి రాకపోతే నా పేరు పద్మేకాదు."

"పంతానికి ఆయన రాకపోతే పిల్లలు గగ్గోలు ఎత్తిపోతారే. పనిమీద నాల్గురోజులు వెడుతున్నాని వాళ్లని వప్పించి వాళ్లనాన్నతో ఆమాట అనద్దని మరీ మరీ చెప్తాలే....ఆయన పిల్లన్ని సరిగా చూస్తారే నేవెళ్ళనని కోపంతో వాళ్లని చావబాదుతారేమో.

"ఇదిగో యీ పిల్లల వీకనెసే మన పాలిట శాపం. అది మగాళ్లకీ తెలుసు. ఆబలహీనత ఆధారంతోటే మనతో ఆడుకుంటారు వాళ్లు.ఓ వారం రోజులు మనసు రాయిచేసుకోవే. జయా.... యింట్లో పెళ్లాంవుంటే చాటుమాటుగా ఎన్ని వ్యవహారాలన్నా నడుపుతారు. కాని పెళ్లాం యింట్లోంచి లేచిపోగానే పరువు పోతుందన్న భయంతో చచ్చినట్లు దారికొస్తారే నాల్గురోజులు పిల్లల్ని, యింటిని చూసుకునేసరికి తాతలుదిగివచ్చి కాళ్లబేరానికి వస్తారు నీవేం అధైర్యపడద్దు. నే చెప్పినట్టువిను.... ప్రయాణంకి సిద్ధం కా. అక్కడ మా అక్కయింట్లో నాల్గురోజులుండు. యీలోపల చూద్దువుగానీ ఏమవుతుందో."

"ఆయన కోపంతో, పంతంతోఆవిడ్ని తెచ్చియింట్లోనే పెడితే."

"నీవెంత పిచ్చిదానివే! ఆవిడగారేం నీ అంత తెలివి తక్కువ దనుకుంటున్నవా. నీయింటికొచ్చి నీమొగుడికి వండిపెట్టి, నీ పిల్లల్ని చూసుకుంటుందనుకుంటున్నవా? పెళ్లిపెటాకులు లేకుండా ఓ ఆడదాన్ని యింటికి తీసుకొచ్చే ధైర్యం నీ మొగుడికుందా అసలు, ఆ అమ్మాయి సినిమాలకి షికార్లకి,హోటళ్లకి తిరుగుతుందిగానిలోకానికి తెలిసేట్టు నీ యింట్లో వచ్చికాపురం చేస్తుందనుకున్నవా.అలా యింటికి తెచ్చిన మర్నాడు లోకం యిద్దరికీ నోట్లో గడ్డి పెడ్తుందని తెలుసు. నీవు యింట్లోవుంటే తీసుకొచ్చే ఛాన్సువుంటే వుంటుందిగాని నీవా యిల్లు విడిచాక చచ్చినా రాదు,తీసుకురాడు.... పిచ్చిమాటలు మానేయి, వారం రోజుల్లో దారికి వస్తాడు సరేనా. ప్రయాణంకి సిద్ధంకా."

"జయా యిలా చెప్పా పెట్టకుండాయిల్లు వదిలి వచ్చేస్తే పిల్లలు, నేను ఏమయిపోతాం అనుకున్నావు.


"చెప్పేవచ్చానుగదా, ఉద్యోగంకి వెడ్తున్నాను అని చెప్పానుగదా.పిల్లలుతల్లి కోసం ఏడుస్తారు అని నాకుతెలుసు, కాని పిల్లల్ని తీసుకొచ్చి పెంచే శక్తి నాకులేదు. అయినా పిల్లల్ని మీరు ఇవ్వనన్నారుగా యింక మీకునేను వున్నా లేకపోయినా పరవాలేదుగా.... పిల్లలమీద నేను ప్రేమతో చచ్చినట్లువుంటాను.

"జయా ప్లీజ్ అలా మాట్లాడకు. వు నిజంగా యిలా వచ్చేస్తావనుకోలేదు...."

"అవును ఏదో వుత్తి బెదిరింపు-కాపురాన్ని మొగుడినీ, పిల్లలనీ వదిలి ఓఆడది ఎక్కడికి పోతుందిలే ఏదో. బెదిరిస్తోంది అనుకున్నారు. అంతేనా. ఈ నమ్మకంతోటేగదా మీ మగాళ్లు ఆటలాడుతారు.

"జయా ఏదో అయిపోయింది. మర్చిపోదాం. యింటికి వెడదాం."

"హూ! మర్చిపోదాం. యీ మాటా మీ మగాళ్ళకిఅలవాటేగా. చేసిందంతా చేసి ఆ మోజులు తీరగానే భార్య దగ్గరికి వచ్చి క్షమించు అనేసరికి పాపం ఈ పిచ్చి ఆడది మొగుడిని దగ్గిరకితీసుకుని 'అయ్యో అలా అనకండి' అనడానికి నేను పద్దెమ్మిదో శతాబ్దం ఆడదాన్నికాదండీ. మర్చిపోదాం-ఎంత తేలిగ్గాఅన్నారు. అదే నేను



చేస్తే అంత సులువుగా మీరు మర్చిపోతారా ?"

"జయా మనిషన్నాక ఏదో వీక్‌నెస్ ● దురా మగాళ్ళకి వీక్‌నెస్ వుంటుంది. మీ ఆడవాళ్ళకి అది తెలియదు. చూడు మీ ఆడవాళ్ళకి బజార్లో చీరలో, స్టీల్ సామాన్లో కనపడగానే ఎంత ఆరాటపడ్తారు! అవి మీకు కావాలని అలాగే మాకూ.

"అహాహా. ఎంత బాగా చెప్పారండీ. అవును ఆడవాళ్ళకి పాపం ప్రాణంలేని వస్తువుల మీద మోజుంటే తప్పులేదు. పాపం చీరలు, సామాన్లతో మా ఆడవాళ్ల బలహీనతలు తీర్చుకుంటాం. అది మీరు చూసి చాలాఔదార్యంతో పెళ్ళానికో చీరో సామానో కొని ముచ్చట తీరుస్తారు. కాని పాపం మీకు అలాంటి వాటిమీద మోజుండదు గనక ప్రాణం వున్న వస్తువులమీద మీ మోజుని మేం అర్థం చేసుకోవాలంటారు. భేష్.... చాలా బాగా చెప్పారు."

"అది కాదు జయా. నీ కర్థం కాదు. మనిషి బలహీనతని ఆ మాత్రం అర్థం చేసుకోలేవా. జయా చూడు ఏదో బలహీన క్షణంలో మగాడు తప్పటడుగు వేస్తాడు. కాని తప్పు చేస్తున్నానన్న భావంతో అనుక్షణం ఎలా గిల్టీగా ఫీలవుతాడో నీకు తెలియదు. కట్టుకున్న భార్యకి అన్యాయం చేస్తున్నానన్న భావంతో ఎంత సతమతమవుతాడో నీ కర్థంకాదు. నా బలహీనత మగాడికి శాపంగాని వరంకాదు అన్న సంగతి నేను తెలుసుకున్నాను జయా. మనశ్శాంతి కరువై, అటు వదలలేక యిటు తప్పుచేస్తున్నానన్న భావం మగవాడిని దహించివేస్తుంది. మన పెళ్ళిలో వున్న మహత్యం. పవిత్రత ఏమిటోకాని కట్టుకున్న భార్యని కాదని మగాడు ఎక్కడికీ వెళ్ళలేడు. వెళ్ళినా తాత్కాలికం! జయా అర్థం చేసుకో....

"చూడండి. నేను ఇల్లు వదలి వచ్చాను కనక సంఘంలో పరువు పోతుందికనక యిల్లుపిల్లల్ని చూసుకోడంకష్టం కనక ఈ రోజు వచ్చి మీ బలహీనత గురించి బాధపడి చెపుతున్నారు. గత ఏడాదిగా లేనిగిల్టీ కాన్షస్ యీ రోజు మిమ్మల్ని బాధపెడుతోంది. మీ మగాళ్ళు అవకాశవాదులు. ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యంలేకపోతే, వచ్చినట్టు మనం ఏంచేసినా సహిస్తుందిరా ఎక్కడికి పోతుంది అనుకుంటారు. అదే నేనీరోజు ఉద్యోగంలో చేరకుండా ఇంట్లో వుండిమిమ్మల్ని నిలేస్తే నా యిష్టం. వుంటే వుండు పోతేపో అనేవారు. నాకు యిల్లు కదిలే ధైర్యం లేదనుకున్నారు. ఉత్తి బెదిరింపు అనుకున్నారు. "కాదని తేలగానే కాళ్ళ బేరానికి దిగారు.

"జయా."

"ఎందుకలా చూస్తారు. నేఅన్నదాన్లో తప్పులేదని మీకు తెలుసు గనక ఏమీ మాట్లాడలేకపోతున్నారు. మా ఆడవాళ్ళు మీ మీద ఆధారపడినంత కాలం మీరేం చేసినా సహించాలి. కాని స్వశక్తితో కాళ్ల మీద నిలబడితే మీ ఆటలు సాగవు. నా యీ పాఠం మా ఆడవాళ్ళంతా నేర్చుకోవాలి.

"జయా చచ్చిన పాముని యింకా చంపకు. ప్లీజ్ యిక మీదట యిలా జరగదని హామీ ఇస్తున్నాను. ఇంటికి వెడదాం రా. పిల్లలు ఏడుస్తున్నారు అమ్మేది అని. ప్లీజ్.

"నాకు కొంచెం టైము కావాలి ఆలోచించడానికి. మళ్ళీ అంత సులువుగా నేను తొందరపడదల్చుకోలేదు. మీ తీపి మాటలకి లొంగిపోయేటంత బలహీనురాలిని కాదు యిప్పుడు. మీరు వెళ్ళండి రెండు రోజులలో నా నిర్ణయం తెలియచేస్తాను. ప్లీజ్ యింకేం చెప్పద్దు యిప్పుడు.

* * *

"నే చెప్పలేదటే యీ మగమహారాజులు అందితే జుట్టు- లేకపోతే కాళ్ళు పట్టుకుంటారని. పెళ్ళాం ఇల్లు వదిలిపోతే వచ్చే అవమానం వాళ్ళకి తెలియదే. ఇంట్లో వుండగా పిచ్చి వేషాలు వేస్తారు. ఆడది తెగించి యిల్లు వదిలితే కాళ్ళ బేరానికి వస్తారు. యిన్నాళ్ళు ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోబట్టి వాళ్ళ ఆటలు సాగాయి.

"పాపం ఏడుపు మినహా వున్నారే. అంతలా దిగజారిపోయారంటే."

"పాపం ట పాపం" ఇంకేం ప్రాణసాధ అట్లనకుడి అంటూ నీవే కాళ్ళు పట్టుకో. నోర్మూసుకొని వుండు.... కాస్త బెట్టుచేసి పిల్లల కోసం వస్తున్నానంటూ వెళ్ళు రేపు.

"థాంక్స్ పద్మా. నిజంగా నీ సలహా లేకపోతే అలాగే సహిస్తూ పడివుండేదాన్ని నాలో నేను కుములుతూ, ఏడ్చి సాధించి ఏం చెయ్యలేక.

"అవునే నీలా ఆడవాళ్లు ఏం చెయ్యలేమని వూరుకోబట్టే యిన్నాళ్ళు కథలు జరిగాయి. తెలివిగా కీలెరిగి వాత పెట్టాలి. దానికి కావల్సింది ఆర్థిక స్వాతంత్ర్యం అది వుంటే ఏదన్నా చెయ్యొచ్చు.

"నిజంగా ఇప్పుడునాకు ఆత్మవిశ్వాసం వచ్చిందే. థాంక్స్ పద్మా....థాంక్స్.

●